క్లుప్తంగా

స్టీల్ ప్లేట్లు పంపిణీ



పంపిణీ చేసిన ప్లేట్లతో విద్యార్థులు, నిర్వాహకులు

హుజూరాబాద్: పట్టణంలోని తెనుగువాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లేట్లు పంపిణీ చేశారు. ట్రస్టు నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్, హెచ్‌ఎం శ్రీరామ్ చక్రధర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు అందజేత



మానకొండూర్: మండలంలోని దేవంపల్లి గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, సొసైటీ అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, నాయులు సిరిశెట్టి రాజేందర్ పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నివారణ టీకాలు



మానకొండూర్: మండలంలోని గంగిపల్లి గ్రామంలో వైద్యాధికారులు అరవిందారెడ్డి, సుష్మితారెడ్డి పశువులకు గాలికుంటు, ముద్ద చర్మ వ్యాధి నివారణ టీకాలు వేశారు. అనంతరం పశువులకు సీజన్‌లో వచ్చే వ్యాధులను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రంగు భాస్కరాచారి, సొసైటీ డైరెక్టర్ అంజుత్‌రావు, ఉపసర్పంచ్ తాళ్లపల్లి సంపత్ గౌడ్, రెడ్డి సంపత్‌రెడ్డి, వైద్య సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు బియ్యం



ఇల్లందకుంట: మండలంలోని పాతర్లపల్లి గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరదనీరు ఇళ్లలోకి చేరడంతో నిత్యావసర వస్తువులు తడిసిపోయిన ఐదు కుటుంబాలకు ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎంపీటీసీ ఎక్కటి సంజీవరెడ్డి ఇరవైఐదు కేజీల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంమల్లయ్య, మాజీ సర్పంచ్ బైరెడ్డి రమణారెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు రామ్‌శ్రీకాంత్, నాయకులు రామ్ చంద్రమౌళి, కృష్ణ, చిరంజీవి, ఎడ్ల దేవేందర్ రెడ్డి, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

'సంఘం పేరుతో అవకతవకలు'



మాట్లాడుతున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి గ్రామానికి చెందిన కూన మహేందర్ ఐదేళ్లుగా ఇందుర్తి మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతూ అనేక అవకతవకలకు పాల్పడుతున్నాడని ముదిరాజ్ సంఘం సభ్యులు ఆరోపించారు. శనివారం చిగురుమామిడిలో మాట్లాడారు. ఇప్పటి వరకు సర్వసభ్య సమావేశం నిర్వహించలేదని, సంఘం ఆర్థిక లావాదేవీలు చూపించలేదన్నారు. గతేడాది నూతన సభ్యత్వం కోసం 250 మంది నుంచి రూ.2,500 చొప్పున రూ.6.25 లక్షలు వసూలు చేసి సొంతానికి వాడుకొన్నాడని తెలిపారు. సంఘం భవన మరమ్మతుల కోసం సంఘంలోని రూ.3 లక్షలు తీసుకుని ఎలాంటి పనులు చేయలేదని సభ్యులు ఆరోపించారు. గతేడాది డిసెంబర్‌తో పదవీకాలం పూర్తయినప్పటికీ రికార్డులను జిల్లా మత్స్యశాఖ అధికారులకు అప్పగించకుండా ఎన్నికలు నిర్వహించకుండా అడ్డుకుంటున్నాడని పేర్కొన్నారు. జిల్లా మత్స్యశాఖ అధికారులు నగదు రికవరీ చేసి సంఘం బలోపేతానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఇందుర్తి ఉపసర్పంచ్ తోట సతీష్, ముదిరాజ్ సంఘం నాయకులు సుతారి కనుకయ్య, గందె రమేశ్, కూన రాజయ్య, దైవాల సమ్మయ్య, కూన కృష్ణ, గట్టు ప్రశాంత్, తిరుపతి, రంజిత అనిల్, సురేశ్, వెంకటేశ్ పలువురు ఉన్నారు. ఈ విషయంపై కూన మహేందర్‌ను ఫోన్‌లో వివరణ కోరగా స్పందించలేదు.

వెనక్కి తిరిగి వెళ్లాల్సిందే..!

- వర్షాకాలంలో కొట్టుకుపోతున్న రోడ్లు
- ప్రయాణికులకు శాపం
- ధ్వంసమైన రోడ్డు వరకు వచ్చి వెనుతిరుగుతున్న వాహనదారులు
- గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు



చొప్పదండి మండలం దేశాయిపేట నుంచి రామడుగు మండలం గుండి రోడ్డుపై గండ్లు

చొప్పదండి: భారీ వర్షాలతో తరుచూ తెగిపోతున్న బీటీ రోడ్లు ప్రయాణికులకు శాపంగా మారుతున్నాయి. నియోజకవర్గంలోని ఆయా గ్రామాల మధ్య రాకపోకలు సాగడం లేదు. చొప్పదండి మండలం దేశాయిపేట నుంచి రామడుగు మండలం గుండి గ్రామాల మధ్య తారురోడ్డు ఇటీవల వర్షాలకు రెండో చోట్ల తెగిపోయింది. మరో చోట గండి పడి కోతకు గురైంది. దీంతో పక్షం రోజులుగా రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్డు సౌకర్యం రెండు గ్రామాల వరకే కాకుండా రెండు మండలాల్లోని ఇరవై గ్రామాల ప్రజలకు ఉపయోగపడుతుండేది. రోడ్డు కోతకు గురవుతుండటం, మరమ్మతుల్లో నిర్లక్ష్యం మూలంగా పక్షం రోజులుగా కార్లు, ఆటోలు, ఇతర వాహనాల్లో ప్రయాణికులు కోత కు గురైన రోడ్డు వరకు వచ్చి ఇరు వైపులా వెనక్కి తిరిగిపోతున్నారు. శనివారం తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేశారు. ప్రత్యామ్నాయంగా మరో దారి లేక ప్రయాణికులు వెనక్కి దేశాయిపేటకు పది కిలోమీటర్ల దూర భారం భరిస్తున్నారు. చిట్యాలపల్లి, మంగళపల్లి, దేశాయిపేట తదితర గ్రామాల ప్రజలు గోపాల్‌రావుపేటకు నిత్యం ప్రయాణం చేయడం పరిపాటి కాగా రోడ్డు ఏటా వర్షాకాలంలో కోతకు గురవుతోంది.

ఏటా ఇదే పరిస్థితి

గుండి గ్రామంలోని చెరువు భారీ వర్షాలకు మత్తడి దూకిన ప్రతీసారి గుండి శివారులోని ఎల్లమ్మ గుడి వద్ద రోడ్డు ధ్వంసమవుతోంది. సమ్మక్క, సారలమ్మ, రేణుకా ఎల్లమ్మ ఆలయాల మధ్య వరదకాలువపై గతంలో తక్కువ ఎత్తులో తూము నిర్మించారు. మరోవైపు తారురోడ్డు తూముకంటే ఎత్తులో ఉండటం ఇప్పుడు శాపంగా మారింది. చుట్టూ ఉన్న ప్రదేశాలు ఎత్తులో ఉండి తూము చిన్నగా మారడంతో చెరువు నుంచి వచ్చే మత్తడి నీటి వేగానికి రోడ్డు కోసుకుపోతోంది. ఏటా మొరం పోస్తూ నెట్టుకువస్తున్నారు. ఈ ఏడాది రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో రామడుగు మండలంలో భారీ వర్షపాతం నమోదైంది. వర్షాలు పడటంతో రోడ్డు రెండు చోట్ల కోతకు గురైంది.



గంగాధర - ఇస్తార్‌పల్లి రోడ్డు

బ్రిడ్జి నిర్మించాలి

సుమారు ఇరవై గ్రామాలకు మూలాధారమైన తారు రోడ్డుపై ప్రయాణానికి ఇబ్బందులు కలగకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని, హైలెవల్ బ్రిడ్జి నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇక్కడ ఉన్న కల్లు మండువాలో వందలాది మంది గీత కార్మికులు ఉపాధి పొందుతుండగా తరుచూ రోడ్డు తెగిపోతుండటంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలికంగా మరమ్మతులు చేసి చేతులు దులపుకుంటున్నారు. మళ్లీ భారీ వర్షం కురిస్తే రోడ్డు తెగిపోయే ప్రమాదముందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రయాణం కష్టం



ఇరవై రోజుల క్రితమే తారు రోడ్డు తెగిపోయింది. చిన్నచిన్న పనులకు కూడా గోపాల్‌రావుపేటకు వెళ్తాం. మాకు ఈ రోడ్డే ఏకైక మార్గం. రోడ్డు తెగిపోవడంతో అదనంగా పది కిలోమీటర్లు ప్రయాణిం చేయాల్సి వస్తోంది. నిర్లక్ష్యం వహించకుండా అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలి.

– సింగిరెడ్డి అశోక్ రెడ్డి, దేశాయిపేట

హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలి



ఏటా రోడ్డు ధ్వంసమవుతోంది. తాత్కాలిక మరమ్మతులు చేస్తే సరిపోదు. బ్రిడ్జి నిర్మించి సమస్య పరిష్కరించాలి. రెండు మండలాల్లోని గ్రామాలకు లింకు రోడ్డు చాలా ఉపయోగపడుతోంది. రోడ్డు కోతకు గురవుతుండటంతో రైతులు, గీత కార్మికులు, వివిధ గ్రామాల ప్రజలు ప్రయాణానికి అవస్థలు పడుతున్నారు.

– పచ్చిమట్ల మహిపాల్‌గౌడ్, దేశాయిపేట

ప్రతిపాదనలు పంపించాం



దశాబ్దాల క్రితం నిర్మించిన తూము నుంచి నీరు పూర్తి స్థాయిలో వెళ్లడం లేదు. దీంతో భారీ వర్షాలకు రోడ్డుపై నుంచి నీరు ప్రవహించి కోతకు గురవుతోంది. ఏటా మరమ్మతులు చేయిస్తున్నాం. బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సంబంధిత అధికారులకు ప్రతిపాదనలు పంపించాం.

– ప్రవీణ్, మాజీ ఎంపీటీసీ, గుండి

తహసీల్దార్‌ను కలిసిన బీసీ సంక్షేమ సంఘం నాయకులు



పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

ఇల్లందకుంట: తహసీల్దార్ గట్ల రమేశ్‌బాబును మండల బీసీ సంక్షేమ సంఘం నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మోత్కూరి శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు కారింగుల రాజేందర్, కోశాధికారి జంపాల తిరేశ్‌నాయి, గైకోటి రాజు, రామకృష్ణ, కౌశిక్, గోవర్ధన్, మధుకర్, గందం రవీందర్, సాయికుమార్, రమేశ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిదో వార్డులో ఉచిత వైద్యపరీక్షలు



పరీక్షలు చేస్తున్న సీఎస్‌సీ వైద్య బృందం

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని ఎనిమిదో వార్డు కౌన్సిలర్ పొనగంటి శ్రీలత ఆధ్వర్యంలో కరీంనగర్ సీఎస్‌సీ(కామన్ సర్వీస్ సెంటర్) హెల్త్ కేర్ సిబ్బంది లేబర్‌కార్డు ఉన్నవారికి శనివారం ఉచిత వైద్య పరీక్షలు చేశారు. వార్డులోని 24 మందికి వివిధ పరీక్షలు చేసి, శాంపిల్స్ సేకరించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రిపోర్ట్స్ ఆధారంగా వైద్యం చేయించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, సీఎస్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

జీపీ కార్మికుల వినూత్న నిరసన



నోటిలో గడ్డితో జీపీ కార్మికుల నిరసన



బండి సంజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న సిబ్బంది



మానకొండూర్‌రూరల్: వంట చేస్తున్న కార్మికులు

జమ్మికుంట: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మె శనివారంతో 31వ రోజుకు చేరింది. కార్మికులు పచ్చిగడ్డి నోటిలో పెట్టుకొని నిరసన తెలిపారు. ప్రభుత్వం కార్మికులను చిన్నచూపు చూస్తోందని, న్యాయమైన సమస్యలు పరిష్కరించాలన్నారు. కనీస వేతనం, మల్టీ పర్పస్ విధానం సవరించాలని, రూ.10 లక్షల ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమలో అధ్యక్షుడు అశోక్, కార్యదర్శి రవీందర్‌రావు, సంపత్, రవి, రమేష్, రాజన్న, తిరుపతి, మధునయ్య, మొగిలి, ఉమా,మానస, వనిత,కమలమ్మ ఉన్నారు.

ఎంపీకి సమస్యలు విన్నవించిన కార్మికులు

శంకరపట్నం: మండల కేంద్రానికి వచ్చిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు శనివారం జీపీ సిబ్బంది సమస్యలు విన్నవించారు. నెలరోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. చాలీచాలని జీతాలతో ఇన్నాళ్లు భరించాం, ప్రభుత్వం సమస్యలు పరిష్కరించేవరకు ఆందోళనలు చేస్తామన్నారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు అండగా ఉండాలని ఎంపీనీ కోరారు. స్పందించిన బండి సంజయ్‌కుమార్ కార్మికులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించి శంకరపట్నంకు వచ్చిన ఎంపీనీ కార్మికులు సన్మానించారు.

మానకొండూర్‌రూరల్: మండలంలోని వివిధ గ్రామాల జీపీ కార్మికులు శనివారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. కార్మికుల సంఘం అధ్యక్షుడు అంజయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఈకార్యక్రమంలో కె.శ్రీనివాస్, జె.రమేశ్, అంజన్‌కుమార్, ఎస్. శ్రీనివాస్, సంపత్, రేణుక పాల్గొన్నారు.

రామడుగు: గ్రామ పంచాయతీ కార్మికులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట వంటావార్పు నిర్వహించారు. రోడ్డుపై భోజనాలు చేసి నిరసన తెలిపారు.



రామడుగు: రోడ్డుపై కార్మికుల భోజనాలు

కార్మికులు నెలరోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోలేని పరిస్థితిలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు లంక కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి ఊట్కూరి రాజు, నాయకులు తడగొండ రమేష్, రాజ్‌మహ్మద్, మీస రాజు, రాజయ్య, శ్రీనివాస్, కనకయ్య, మహేశ్వరి, లక్ష్మీ, దుర్గయ్య పలువురు పాల్గొన్నారు. వీరికి పలువురు సంఘీభావం తెలియజేశారు.

చిన్నారులకు తల్లిపాలే తాగించాలి



గర్భిణులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

రామడుగు: మండలంలోని వెదిర ప్రాథమిక పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం శ్రీ రాజరాజేశ్వరస్వామి లయన్స్ క్లబ్ కరీంనగర్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు లయన్ బి. సరళ గర్భిణులు, బాలింతలకు వాయినాలు అందించి శాలువాతో సన్మానించారు. అనంతరం సరళ మాట్లాడుతూ.. చిన్నారులకు తల్లిపాలు తాగించాలని, పుట్టిన పిల్లలకు వెంటనే ముర్రుపాలు తాగిస్తే చిన్నారుల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. గర్భిణులు మంచి పోషకాహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనిచ్చే అవకాశం ఉందని, అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు సంపత్‌కుమార్, సంగీత, జిల్లా కోఆర్డినేటర్ శంకర్‌ప్రసాద్‌రెడ్డి, సభ్యులు సీహెచ్ మల్లారెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు వంచ భాగ్యరాణి, సునీత, భార్గవి పలువురు పాల్గొన్నారు.

ఎన్నికలప్పుడే పథకాలు గుర్తుకొస్తాయి

మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి



లక్ష్మన్నపల్లిలో మాట్లాడుతున్న ప్రవీణ్‌రెడ్డి

సైదాపూర్: ఎన్నికలప్పుడే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పథకాలు గుర్తుకువస్తాయని, రుణమాఫీపై నాలుగేళ్లుగా సదీసప్పుడు చేయలేదని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఉద్యమాలతోనే రుణమాఫీ ప్రకటన చేశారని, ఇప్పుడు పార్టీ నాయకులు సంబురాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. శనివారం మండలంలోని లక్ష్మన్నపల్లిలో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేసిందని, మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే రైతు సంక్షేమం సాధ్యమవుతుందని అన్నారు. ఉచిత కరెంటు, ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. నేడు పండించిన పంట అమ్ముకోవడానికి రైతులు అరిగోసపడుతున్నారని, రైతుబంధు ఇచ్చి సబ్సిడీ ఎత్తేశారని, ఎరువులు విత్తనాల ధరలు పెరిగాయన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని, తెలంగాణ వస్తే బాగుపడతామనుకున్న యువత ఆశలను ప్రభుత్వం ఆవిరి చేసిందన్నారు. నిరుద్యోగ భృతి, దళితులకు మూడెకరాల భూమి, పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల హామీలు నెరవేరలేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ధర్నా

చిగురుమామిడి: మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సీఎం కేసీఆర్ జిల్లాకు అనేక వాగ్దానాలు చేశారని, ఒక్కటి కూడా నెరవేర్చలేదని హుస్నాబాద్–కరీంనగర్ ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. ఎన్నికల హామీలు నెరవేరలేదన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి రవీందర్, జిల్లా అధికార ప్రతినిధులు సత్యనారాయణరెడ్డి, ప్రవీణ్‌కుమార్, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి నరేశ్, నాయకులు, పాల్గొన్నారు.



రామడుగు: శిలాఫలకం వద్ద నాయకుల నిరసన

రామడుగు: ప్రభుత్వం పేదల కోసం నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఎప్పుడు పూర్తి చేసి అందజేస్తారో తెలియని పరిస్థితి నెలకొందని టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కన్వీనర్ వెన్న రాజమల్లయ్య తెలిపారు. మండలంలోని వెదిర గ్రామ శివారులోని వెంకటగిరి వద్ద 'డబుల్' ఇళ్ల నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, ప్రస్తుత ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ వేర్వేరుగా శిలాఫలకాలు ఏర్పాటు చేసినా నిర్మాణాలు పూర్తికాలేదని ఆరోపించారు. శిలాఫలకాల వద్ద శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అంజయ్య, హన్మాండ్లు పలువురు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

వీణవంక: పోతిరెడ్డిపల్లిలో బాలవికాస ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. హనుమకొండలోని శ్రీలక్ష్మీనరసింహ ఆసుపత్రి వైద్యులు పరీక్షలు చేసి మందులు అందజేశారని బాలవికాస జమ్మికుంట సెంటర్ మేనేజర్ సులోచన తెలిపారు. సర్పంచ్ అనూషసతీశ్‌గౌడ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గంగాధర మండలంలోనే కొనసాగించాలి

గంగాధర: తమ గ్రామాన్ని గంగాధర మండలంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ వెంకంపల్లి గ్రామస్తులు శనివారం మధురానగర్ చౌరస్తాలో ధర్నా చేపట్టారు. ఉప్పరమల్యాల రెవెన్యూ పరిధిలోని వెంకంపల్లిని నూతన పంచాయతీగా ఏర్పాటు చేశారన్నారు. కొత్తగా మండల కేంద్రంగా ఏర్పాటయ్యే గర్శకుర్తిలో ఉప్పరమల్యాలను కలపడానికి అధికారులు ప్రతిపాదనలు పంపారని తెలిపారు. అందులో వెంకంపల్లి సైతం కలుస్తుందని, అర కిలోమీటరు దూరంలోని గంగాధర మండలంలో కాకుండా ఆరు కిలోమీటర్ల దూరంలోని గర్శకుర్తిలో తమ గ్రామాన్ని కలపొద్దని డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామానికి చెందిన పోకాల మల్లేశం ముఖ్యమంత్రి కార్యాలయంలో వినతిపత్రం అందజేశాడు.



ధర్నా చేస్తున్న వెంకంపల్లి గ్రామస్తులు

ఆర్థికసాయం, పరామర్శ

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన వంతడ్పుల లింగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శనివారం ఆయన కుటుంబ సభ్యులను ఎంపీపీ రాణిసురేందర్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు. వెంట మాజీ ఎంపీటీసీ సదానందం, మండల కొమురయ్య, విశ్వనాథ్, అశోక్, కన్ని, విజయ్, సతీశ్, రమేశ్, తదితరులు ఉన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ఇప్పల్‌నర్సింగాపూర్‌కు చెందిన గూడూరు గోపాల్‌రెడ్డి మృతిచెందగా అంత్యక్రియల నిమిత్తం హుజూరాబాద్ పీఏసీఎస్ చైర్మన్ ఎడవల్లి కొండల్ రెడ్డి శనివారం రూ.10 వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతిచెందిన వ్యక్తి పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో పంట ఋణం కలిగి ఉండటంతో నగదు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బొయిన శంకర్, పాలకవర్గ సభ్యులు గూడూరి ప్రభకర్ రెడ్డి, ఒడ్డు అనసూర్య, దండ భాస్కర్ రెడ్డి, యాళ్ల సూజాత, గొస్కుల శ్రీనివాస్, ప్రతాప ఆంజనేయులు, నరెడ్ల మధుసూదన్‌రెడ్డి, సంగాల రవీందర్, సిరికొండ లింగారావు, లోకిని సాయిలు, ముగల లక్ష్మారెడ్డి, సంఘం సీఈవో వివేకానంద పాల్గొన్నారు.

గంగాధర: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ఆచంపల్లి, గట్టుభూత్కూర్ గ్రామాలకు చెందినవారి కుటుంబ సభ్యులకు మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన తూడి లచ్చన్న శనివారం ఆర్థికసాయం అందజేశారు. రూ. ఐదు, పదివేల చొప్పున నగదు అందించారు. వెంట తూడి లచ్చన్న యువసేన సభ్యులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని ధర్మరాజుపల్లి గ్రామంలో మాజీ వార్డు మెంబర్ మారెపల్లి వీరాస్వామి, మంద శివప్రసాద్ అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం బీఆర్‌ఎస్ నాయకులు వొడితల ప్రణవ్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంట సర్పంచ్ పాకాల లక్ష్మారెడ్డి, ఉపసర్పంచ్ సాంబయ్య, మాజీ సర్పంచ్ చిలుముల సత్తయ్య, నిమ్మ రాజయ్య, యూత్ నాయకులు అనిల్ రెడ్డి, శ్రీకాంత్, నాగరాజు, అశోక్, రాజ్ కుమార్, సాయి క్రిష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను కేటాయించాలని గ్రామస్తుల డిమాండ్

ఇల్లందకుంట: మండలంలోని గడ్డివానిపల్లి గ్రామం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 35 మంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు ఉన్నాడు. దీంతో విద్యార్థులకు అన్ని తరగతులు బోధించడం ఉపాధ్యాయుడికి కష్టంగా ఉందని, విద్యార్థులకు చదువు అందడంలేదని, మరో ఇద్దరు ఉపాధ్యాయులను పాఠశాలకు కేటాయించాలని గ్రామస్తులు శనివారం స్కూల్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

- **యువత సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలి**

హుజూరాబాద్: లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమకొండ యోధ అధ్యక్షుడిగా హుజూరాబాద్ మున్సిపాలిటీకి చెందిన సందమల్ల నరేశ్ ఎన్నికయ్యారు. ఈసందర్భంగా నరేశ్ మాట్లాడారు. సామాన్య సభ్యుడి నుంచి అధ్యక్ష పదవి వరకు తీసుకెళ్లింది సామాజిక సేవా కార్యక్రమాలేనని అన్నారు. యువత సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఎన్నికకు సహకరించిన లయన్ పద్మజాదేవి, రాఖీ, పద్మజారావు, పాపారావు, విజయలక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు.

- **వ్యక్తిపై కేసు నమోదు**

జమ్మికుంట: మహిళను వేధించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ రాధాకృష్ణ తెలిపారు. మారుతినగర్‌కు చెందిన మహిళ శనివారం సాయంత్రం పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని కిరాణం షాపు వద్దకు రాగా అక్కడే ఉన్న పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించి, బూతులు తిడుతూ దాడికి పాల్పడ్డాడు. అవ్యక్తిపై గతంలో రౌడీషీటర్ కేసు నమోదైందని, మహిళ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ తెలిపారు.